రైతు నోట్లో కాంగ్రెస్ మట్టి

82 వేల కోట్లకు 19 వేల కోట్లిస్తారా? • రైతు భరోసాకే ఏటా 22 వేల కోట్లు కావాలి • సాగుకు 19 వేల కోట్లు ఎలా సరిపోతాయ్?: హరీశ్

- నిరుద్యోగులు, ఉద్యోగుల ఆశలపై కాంగ్రెస్ సర్కారు నీళ్లుజల్లింది
- 24 గంటల కరెంటు ఎక్కడిస్తుండ్రు
- పింఛన్లపై సీఎం నోరు విప్పరేం?
- గృహజ్యోతికి రూ.2,400 కోట్లు ఎలా సరిపోతాయి?
- మహాలక్ష్మి రూ.2,500 ఎక్కడ?
- ఆరు గ్యారెంటీలపై చట్టం ఏది?
- నాడు అప్పులని ఏడ్చి.. మీరెలా రూ.59 వేల కోట్ల అప్పు తెస్తారు?
- బడ్జెట్‌లో అన్ని వర్గాలకు అన్యాయం
- మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం

శనివారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు. చిత్రంలో ఎమ్మెల్యేలు వేముల ప్రశాంత్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, డాక్టర్ సంజయ్, ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, దేశపతి శ్రీనివాస్

హైదరాబాద్, ఫిబ్రవరి 10 (నమస్తే తెలంగాణ): ఎన్నో ఆశలు పెట్టుకున్న రైతులు, మహిళలు, నిరుద్యోగులు, ఉద్యోగులు, వృద్ధులు, వికలాంగులతో అన్ని వర్గాలకు కాంగ్రెస్ ప్రభుత్వం తొలి బడ్జెట్‌లోనే మొండిచెయ్యి చూపిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. బడ్జెట్ అనంతరం ఆయన మీడియా పాయింట్‌లో మాట్లాడారు. ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో ప్రభుత్వం అన్ని వర్గాలకు తీవ్ర అన్యాయం చేసిందని మండిపడ్డారు. తొలిరోజు నుంచే వాగ్దాన భంగానికి పాల్పడుతున్నదని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ప్రజాపాలనపై సీఎం చాలా గొప్పగా చెప్పారని, ప్రతిరోజూ ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తానని చెప్పి.. కొద్దిరోజులు మంత్రులకు, ఆ తర్వాత అధికారులకు, ఇప్పుడు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వినతులు అప్పగించారని ఎద్దేవా చేశారు. మొత్తానికి సోకాల్డ్ ప్రజాపాలన అభాసు పాలైందని విమర్శించారు. బడ్జెట్‌పై కొండంత ఆశలు చూపించి.. గోరంత కేటాయింపులు కూడా చేయలేదని ఆరోపించారు. ప్రభుత్వం నాటి నుంచి ఊదరగొడుతున్న ఆరు గ్యారెంటీల అమలుపై బడ్జెట్‌లో స్పష్టత ఇవ్వలేదన్నారు.

రూ.82 వేల కోట్లకు రూ.16 వేల కోట్లా?

తెలంగాణ వ్యవసాయరంగానికి ఏటా కనీసం రూ.82 వేల కోట్లు అవసరమైతే.. బడ్జెట్‌లో రూ.16 వేల కోట్లు మాత్రమే ఎలా కేటాయిస్తారని హరీశ్‌రావు ప్రశ్నించారు. 'కోటి ఎకరాల సాగుభూమికి కాంగ్రెస్ ఇస్తామన్న రూ.15 వేల రైతుభరోసాను లెక్కలేస్తే, ఆ ఒక్క పథకానికే ఏటా రూ.22,500 కోట్లు కావాలి. డిసెంబర్ 9నే రుణమాఫీ చేస్తామన్నారు. ఇప్పుడు ఫిబ్రవరి 9 కూడా వెళ్లిపోయింది. రుణమాఫీపై బడ్జెట్‌లో కనీసం స్పష్టత కూడా ఇవ్వలేదు. రైతు రుణమాఫీకి ఏటా రూ.40 వేల కోట్లు అవసరం. కానీ, నాలుగు రూపాయలు కూడా కేటాయించలేదు. మేం రైతులం దరికీ రైతుబీమా చేశాం. కాంగ్రెస్ పార్టీ కౌలు రైతులకు కూడా రైతుబీమా ఇస్తామని చెప్పింది. అందుకు కనీసం రూ.2 వేల కోట్లు అవసరం. దానిపై కూడా బడ్జెట్‌లో స్పష్టత లేదు. వడ్లు, మక్కలు, కంది, సోయా, జొన్న పంటలకు కనీస మద్దతు ధరతో పాటు బోనస్ కూడా ఇస్తామన్నారు. వాటికి కనీసం రూ.15 వేల కోట్లు అవసరం. బోనస్‌ను కూడా బోగస్ చేశారు. ఉద్యానవన పంటలు, లిఫ్ట్ ఇరిగేషన్, స్ప్రింక్లర్ సెట్లకు అన్నీ కలుపుకొని మొత్తం రూ.82 వేల కోట్ల బడ్జెట్ అవుతుది. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం జీతాలు పోగా కేవలం రూ.16 వేల కోట్లు కేటాయించడం సిగ్గుచేటు. దగా చేసిన కాంగ్రెస్ సర్కారు రైతుల ఆగ్రహానికి గురికాక తప్పదు' అని హెచ్చరించారు.

24 గంటల కరెంట్‌పై సవాల్‌కు సిద్ధమా?

కాంగ్రెస్ ప్రభుత్వం అటు ఎన్నికల ప్రచారంలోనూ.. ఇటు నిండు అసెంబ్లీలోనూ పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నదని హరీశ్‌రావు విమర్శించారు. 'ప్రజా పాలన ఒక అబద్ధం.. 24 గంటల కరెంటు మరో అబద్ధం. రాష్ట్రంలో ఎక్కడా రైతులకు 24 గంటల కరెంటు రావడం లేదు. సీఎం, ఉప ముఖ్యమంత్రి, మంత్రులు ఏ సబ్‌స్టేషన్‌కు వస్తారో చెప్పండి.. అక్కడికెళ్లి రికార్డులు తీద్దాం. ఎక్కడా 14-15 గంటలకు మించి కరెంటు ఇవ్వడం లేదు. బడ్జెట్ ప్రసంగంలో మాత్రం 24 గంటలు కరెంటు ఇస్తున్నామని చెప్పడం సిగ్గుచేటు. గతంలో కాంగ్రెస్ పానలో రైతులకు ఉచిత కరెంటు ఇచ్చామని, రైతులు చాలా ఆనందంగా ఉండేవారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మిలీనియం జోక్ వేశారు. దొంగరాత్రి కరెంటు ఇస్తే ఆనందంగా ఉన్నారా? అర్ధరాత్రి పొలానికి పోతే పాముకాట్లు, తేలుకుట్లతో రైతుల చనిపోతే ఆనందంగా ఉన్నారా? కరెంటు షాకుకు మరణిస్తే సంతోషంగా ఉన్నారా? నాటి కాంగ్రెస్ పాలనలో ఉచిత కరెంటు అంటే ఉత్త కరెంటే.. ఎటు చూసినా కాలిపోయిన మోటర్లు, పేలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లే' అని మండిపడ్డారు.

పింఛన్లపై సీఎం ఎందుకు మాట్లాడరు?

చేయూత పింఛన్లు రూ.4 వేలకు పెంచటంపై సీఎం ఎందుకు నోరు మెదుపటం లేదని హరీశ్‌రావు ప్రశ్నించారు. రూ.10 లక్షల ఆరోగ్యశ్రీపై ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. 'ఇప్పటికే 24 లక్షల మంది ఆసరా పింఛన్లు కట్ చేశారు. ఇంకా ఎన్ని కోతలు పెడతారు? ఎన్ని కొర్రీలు పెడతారు? ఎన్ని కోట్ల మందికి పింఛన్లు ఇస్తారో చెప్పాలి. ఆసరా పింఛన్ల కోసం అన్నార్థులు, అభాగ్యులు, పేదలు, వృద్ధులు, వికలాంగులు ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం పింఛన్లను ఎగ్గొడుతున్నది. పింఛన్లను ఎందుకు ఎగ్గొడుతున్నారని అసెంబ్లీలో సీఎంను నిలదీస్తే నోరు మెదపడం లేదు. కాంగ్రెస్ ఇస్తామన్న రూ.4 వేల పింఛన్ ఇవ్వకపోగా.. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన రూ.2 వేల పింఛన్ కూడా ప్రస్తుత ప్రభుత్వం ఇవ్వటంలేదు. జనవరి, ఫిబ్రవరి నెల పింఛన్లు చాలామందికి నేటికీ రాలేదు. పింఛన్లు రాలేదని లబ్ధిదారులు మా ఎమ్మెల్యేల చుట్టు తిరుగుతున్నారు. కొండ నాలుకకు మందేస్తే.. ఉన్న నాలుక ఊడినట్టయ్యింది' అని మండిపడ్డారు.

రెండు లక్షల ఉద్యోగాలు లేనట్టేనా?

బడ్జెట్‌లో ఎక్కడైనా నిరుద్యోగ భృతి గురించి ప్రస్తావించారా? అని హరీశ్‌రావు ప్రశ్నించారు. 'ఎన్నికల వేళ నిరుద్యోగ భృతి గురించి యువజన డిక్లరేషన్‌లో ప్రియాంకగాంధీ, రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి చాలా గొప్పగా చెప్పారు. బడ్జెట్‌లో నిరుద్యోగులను ఎందుకు మర్చిపోయారు? ఏడాదిలో కొత్తగా రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించారు. బడ్జెట్‌లో అందుకు తగిన కేటాయింపులు ఎందుకు చేయలేదు? ఉద్యోగులకు అదనంగా రూ.1000 కోట్లు కేటాయిస్తే.. పెండింగ్ ఎరియర్స్, డీఏలు, పీఆర్సీ బకాయిలు, ఐఆర్ వంటివి ఎలా చెల్లిస్తారు? ఉద్యోగులకు పీఆర్సీ పెంచుతూ బడ్జెట్‌లో నిధులు ఎందుకు పెట్టలేదు? కాంగ్రెస్ ప్రభుత్వం ఇటు ఉద్యోగులను అటు నిరుద్యోగులను మోసం చేసింది' అని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఉద్యోగులకు మూడు డీఏలు ఎప్పుడిస్తారని ప్రశ్నించారు.

59 వేల కోట్ల అప్పు మీరెందుకు తెచ్చారు?

నేతి బీరకాయలో నెయ్యి ఉండటం ఎంత నిజమో.. కాంగ్రెస్ నేతల మాటల్లో కూడా నిజం అంతేనని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. అప్పులు చేశారని మాపై ఏడ్చిన కాంగ్రెస్ నాయకులు, ఇప్పుడు మాకంటే రూ.19 వేల కోట్లు అధికంగా అప్పులు తీసుకొస్తామని చెప్పింది. బీఆర్ఎస్ ప్రభుత్వం ఓపెన్ మార్కెట్ బారోయింగ్స్ కింద రూ.40 వేల కోట్ల అప్పులు తీసుకొస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.59,620 కోట్లు అప్పు తీసుకొచ్చేందుకు సిద్ధమైంది' అని విమర్శించారు. ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. వారి గురించి కూడా బడ్జెట్‌లో పెట్టాలని అడిగినా ఎక్కడా ప్రస్తావించలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఆటో కార్మికుల అప్పులను, రుణాలను మాఫీ చేయాలని, నెలవారీ భృతి రూ.10 వేలు ఇవ్వాలని, చనిపోయిన ఆటో డ్రైవర్ల కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అసెంబ్లీలో డిమాండ్ చేసినట్టు తెలిపారు. 21 మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకున్నా ప్రభుత్వానికి కనికరం లేదని మండిపడ్డారు.

రూ.59 వేల కోట్లు ఎలా వస్తాయో చెప్పాలి

గత సంవత్సరం బడ్జెట్‌ను తగ్గించి రూ.2,24,624 వస్తున్నట్టు చెప్పి, రూ.2,75,896 కోట్ల బడ్జెట్‌ను సభలో ప్రవేశపెట్టారని, మిగతా రూ.59 వేల కోట్లు ఎక్కడి నుంచి వస్తాయని హరీశ్‌రావు ప్రశ్నించారు. 'రూ.59 వేల కోట్లు రాబట్టేందుకు ప్రజలపై కొత్త పన్నులు వేస్తారా? భూములు అమ్ముతారా? ఆ డబ్బు ఎలా తెస్తారు?' అని నిలదీశారు. గత ప్రభుత్వం కల్పించిన మౌలిక సదుపాయాలు కనిపించడం లేదా? ప్రశ్నించారు. అసెంబ్లీ సాక్షిగా అబద్ధాలు చెబుతున్న సీఎంకు ప్రివిలేజ్ నోటీసులు ఇవ్వాలని అన్నారు. హరీశ్‌రావు వెంట ఎమ్మెల్యేలు ప్రశాంత్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సంజయ్, ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, తాతామధు, దేశపతి శ్రీనివాస్ ఉన్నారు.

ఆరు గ్యారెంటీలపై చట్టం ఏది?

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారెంటీల అమలుపై శాసనసభ మొదటి సమావేశంలోనే చట్టం చేస్తామని చెప్పిన కాంగ్రెస్ నేతలు ఎక్కడున్నారని హరీశ్‌రావు ప్రశ్నించారు. 'చట్టం ఏమైంది? ఎందుకు చేయడం లేదు? రెండు సభలు పూర్తయినా చట్టం ఎందుకు చేయలేదు. శ్వేత పత్రాలతో గత ప్రభుత్వంపై బురద జల్లుతూ కాలం గడుపుతున్నారు. రూ.2 లక్షల రుణమాఫీ డిసెంబర్ 9న వేస్తామని బాండు పేపర్లు రాసిచ్చిన కాంగ్రెస్ నాయకులు ఎక్కడున్నారు? బడ్జెట్ ప్రసంగంలో ఎక్కడైనా వందరోజుల్లో హామీల అమలుపై ప్రస్తావన ఉన్నదా? రెండు గ్యారెంటీలు అమలు చేశామని కాంగ్రెస్ నాయకులు పచ్చి అబద్ధాలు చెప్పున్నారు. ఆరు గ్యారెంటీల్లోని 13 హామీల్లో ఒకటి మాత్రమే అమలు చేసిన మోసపు చ్చుతున్నారు' అని మండిపడ్డారు.

ఇందిరమ్మ ఇండ్లపైనా అబద్ధాలేనా?

నిండు శాసనసభ సాక్షిగా ఇందిరమ్మ ఇండ్లపై కూడా ప్రభుత్వ పెద్దలు అబద్ధాలు చెప్పారని హరీశ్‌రావు విమర్శించారు. 'ఒక్కో నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా కలిపితే 4,16,500 ఇండ్లకు కనీసం రూ.20,820 కోట్లు అవసరం. ఎస్సీ, ఎస్టీలకు మరో లక్ష ఎక్కువ ఇస్తామని చెప్పారు. ఆ రకంగా మొత్తం రూ.23 వేల కోట్లకు పైగా నిధులు అవసరమవుతాయి. బడ్జెట్‌లో మాత్రం రూ.7 వేల కోట్లు కేటాయించి ఇందిరమ్మ ఇండ్ల పేరుతో కూడా ప్రజలను మోసం చేశారు. మహాలక్ష్మి పథకం గురించి చాలా గొప్పగా చెప్పారు. రాష్ట్రంలో 18 ఏండ్లు నిండిన మహిళలు 1.50 కోట్ల మంది ఉన్నారు. వారికి నెలకు రూ.2,500 ఇవ్వాలంటే రూ.45 వేల కోట్లు అవసరమవుతాయి. అన్ని పథకాలకు కలిపి రూ.52 వేల కోట్లు పెట్టారు. ఒక్క రైతు రుణమాఫీకే రూ.40 వేల కోట్లు కావాలి. ఇంత తక్కువ నిధులతో పథకాలను ఎలా అమలు చేస్తారో ప్రజలకు ప్రభుత్వం చెప్పాలి. ఇటు గృహజ్యోతికి రూ.8 వేల కోట్లు అవసరం ఉంటే.. రూ.2,400 కోట్లు మాత్రమే కేటాయించారు. 90 లక్షల మంది తెల్లరేషన్‌కార్డు దారులకు ఇవి ఎలా సరిపోతాయి. గృహజ్యోతిలో కూడా 75 శాతం మందికి కోతలు విధించేందుకే ఇలా చేస్తున్నారు' అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పంట బీమా ఎలా అమలు చేస్తారు?

కేసీఆర్ హయాంలో రైతును రాజు చేసేందుకు సాగునీరు, రైతుబంధు, రైతుబీమా, 24 గంటల కరెంటు, పంట కొనుగోళ్లు వంటి అనేక పథకాలు తీసుకొస్తే.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పథకాలను తుంగలో తొక్కి.. రైతుల నోట్లో మట్టికొట్టి.. అన్నదాతలను ఆగం చేసిందని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. అంకెలు మార్చి, ఆంక్షలు పెట్టి అన్నదాత నోరు కొట్టేలా బడ్జెట్ ఉన్నదని ఆరోపించారు. ఎన్నికల సమయంలో చాంతాడంత చెప్పి బడ్జెట్‌లో చెంచాడు కూడా ఇవ్వలేదని విమర్శించారు. రైతుబంధుకు రామ్‌రామ్ చెప్పారని, రుణమాఫీకి మొండిచేయి చూపి పంటలకు బోనస్ బోగస్ అన్నట్టుగా బడ్జెట్ కేటాయింపులు జరిగాయని అన్నారు. 'ఈ బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి రూ.19,746 కోట్లు పెట్టామని చెప్పారు. అందులో రూ.3 వేల కోట్లు వేతనాలకు పోతే.. మిగిలిన రూ.16 వేలకోట్లలో రైతు భరోసా ఎంతొస్తది? రుణమాఫీ ఎంత చేస్తారు? రైతు బీమాకు నిధులు ఎలా ఇస్తారు? పంట బీమా ఎలా అమలు చేస్తారు? వీటన్నింటికి నిధులు ఏవి?' అని సూటిగా ప్రశ్నించారు. రైతులకు అభయాస్తం కాస్తా మొండిచెయ్యిగా మారిందని ధ్వజమెత్తారు.

శనివారం రాష్ట్ర శాసనసభలో ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెడుతున్న ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క. చిత్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

తెలంగాణ బడ్జెట్ 2,75,891 కోట్లు

- రెవెన్యూ వ్యయం 2,01,178 కోట్లు
- మూలధన వ్యయం 29,669 కోట్లు
- 4 నెలల కాలానికి ఓట్ ఆన్ అకౌంట్ శాసనసభలో ప్రవేశపెట్టిన భట్టి

హైదరాబాద్, ఫిబ్రవరి 10 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌ను శాసనసభలో డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క, శాసనమండలిలో అసెంబ్లీ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రవేశ పెట్టారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.2,75,891 కోట్ల ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను సమర్పించారు. ఈ బడ్జెట్ నాలుగు నెలల కాలానికి అని, జూలైలో పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశ పెడతామని మంత్రులు చెప్పారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రెవెన్యూ వ్యయం రూ.2,01,178 కోట్లుగా పేర్కొన్నారు. మూలధన వ్యయం రూ.29,669 కోట్లుగా ప్రతిపాదించారు. ద్రవ్యలోటు రూ.32,557 కోట్లుగా, రెవెన్యూ మిగులు రూ.5,944 కోట్లుగా బడ్జెట్‌లో పొందుపరిచారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పిన ఆరు గ్యారెంటీలకు అత్యధికంగా రూ.53,196 కోట్లు కేటాయించారు.

బడ్జెట్ కేటాయింపులు ఇలా (రూ. కోట్లలో...)

అంశం	కేటాయింపులు
ఆరు గ్యారెంటీలు	53,196
పంచాయతీ రాజ్	40,080
పురపాలక శాఖ	11,692
వ్యవసాయం	19,746
విద్యారంగం	21,389
వైద్యరంగం	11,500
నీరుపారుదల శాఖ	28,024
పరిశ్రమల శాఖ	2,543
ఐటీ శాఖ	774
మూసీ రివర్ ప్రాజెక్ట్	1,000
ఎస్సీ సంక్షేమం	21,874
ఎస్టీ సంక్షేమం	13,013
బీసీ సంక్షేమం	8,000
మైనార్టీ సంక్షేమం	2,262
విద్యుత్తు - గృహ జ్యోతి	2,418
విద్యుత్తు సంస్థలు	16,825
గృహ నిర్మాణం	7,740
తెలంగాణ పబ్లిక్ స్కూల్స్	500

రెవెన్యూ వ్యయం	మూలధన వ్యయం	ద్రవ్యలోటు	రెవెన్యూ మిగులు
రూ.2,01,178 కోట్లు	రూ.29,669 కోట్లు	రూ.32,557 కోట్లు	రూ.5,944 కోట్లు

పైలట్ పద్ధతిలోనే 'పబ్లిక్ స్కూల్స్'

బడ్జెట్‌లో రూ.500 కోట్లు కేటాయింపు

హైదరాబాద్, ఫిబ్రవరి 10 (నమస్తే తెలంగాణ): అంతర్జాతీయ ప్రమాణాలతో నెలకొల్పే 'తెలంగాణ పబ్లిక్ స్కూల్స్'ను ప్రస్తుతానికి పైలట్ పద్ధతిలోనే ప్రారంభిస్తారు. జిల్లాకు ఒకటి చొప్పున వీటిని ప్రారంభించే అవకాశాలున్నాయి. అంతర్జాతీయ ప్రమాణాలతో అధునాతన సౌకర్యాలతో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ పెడతామని రాష్ట్ర బడ్జెట్‌లో ప్రభుత్వం ప్రకటించింది. ఇందుకు రూ.500 కోట్లు ప్రతిపాదించింది. రాష్ట్రంలో 614 మండలాలున్నాయి. వీటిల్లో మండలానికి ఒకటి చొప్పున ఇంటర్నేషనల్ స్కూల్స్‌ను ఏర్పాటు చేస్తామని గతంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది.

- స్కిల్ వర్సిటీ ఏర్పాటుపై ఇప్పటికే గుజరాత్, ఢిల్లీ, ఒడిశా రాష్ట్రాల్లో అధ్యయనం చేశారు. అత్యుత్తమ విధానాలను రాష్ట్రం లోను అమలుచేస్తారు.
- పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా రాష్ట్రంలోని 65 ఐటీఐలను, ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యంతో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లుగా మారుస్తారు. ఐటీఐలలో అదనంగా సీట్లను పెంచుతారు.
- కళాశాల స్థాయిలో ఉద్యోగాలకు అవసర మైన కోర్సులను ప్రవేశపెడతారు.
- టీఎస్‌పీఎస్సీలో అదనపు సిబ్బంది, నిర్వహణకు రూ. 40 కోట్లు కేటాయించారు.

వైద్యారోగ్య రంగానికి తగ్గిన కేటాయింపులు

హైదరాబాద్, ఫిబ్రవరి 10 (నమస్తే తెలంగాణ): వైద్యారోగ్య రంగానికి బడ్జెట్‌లో కేటాయింపులు తగ్గాయి. గతేడాది ప్రభుత్వం రూ.12,161కోట్లు కేటాయించింది. ఈసారి ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో రూ.11,500 కోట్లు ప్రతిపాదించింది. అంటే సుమారు.. రూ.651 కోట్లు కోత పడింది. నాలుగు నెలల కాలానికి రూ.3,690 కోట్లు కేటాయించింది. వాస్తవానికి ఈ ఏడాది వరంగల్ హెల్త్ సిటీ, హైదరాబాద్ చుట్టూ నాలుగు టిమ్స్ దవాఖానలు, కొత్త మెడికల్ కాలేజీల నిర్మాణాలు పూర్తి చేయాల్సి ఉన్నది. దీనికితోడు ప్రభుత్వం ప్రజలందరికీ డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ రూపొందిస్తామని హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో వైద్యారోగ్య రంగానికి ఈ దఫా సుమారు రూ.13 వేల కోట్లకుపైగా కేటాయిస్తారని భావించగా.. నిరుడికన్నా కోత విధించడం గమనార్హం.

'కాళేశ్వరం' ప్రాజెక్టుకు రాంరాం..!

- నిరర్థక ఆస్తిగా భావిస్తున్న ప్రభుత్వం
- బడ్జెట్ కాపీలోనే పేర్కొన్నవైనం
- ప్రాణహిత చేవేళ్లను చేపడుతాం
- పాలమూరు-రంగారెడ్డి ఊసేలేదు
- మొత్తం నిధులు 28,024 కోట్లు
- పెండింగ్ బిల్లులకే సరిపోని బడ్జెట్

హైదరాబాద్, ఫిబ్రవరి 10 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం ప్రాజెక్టును పక్కన పెట్టాలని కాంగ్రెస్ ప్రభుత్వం యోచిస్తున్నది. అందుకు తాజాగా బడ్జెటే నిదర్శనం. బడ్జెట్‌లో 'మా ప్రభుత్వం దుబారా వ్యయాన్ని గణనీయంగా తగ్గిస్తుంది. కాళేశ్వరం ప్రాజెక్టు లాంటి నిరర్థకమైన ఆస్తులు పెంచుకుంటూ, వాటిని తెలంగాణ ప్రజలకు భారంగా చేయడం మా విధానం కాదు' అని ప్రకటించింది. ఈ లెక్కన ఆ ప్రాజెక్టు పనులను సైతం పూర్తిగా అటకెక్కించేందుకు సిద్ధమైందని నిపుణులు అంటున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును నిరర్థక ఆస్తిగా అభివర్ణించిన ప్రభుత్వం, మరోవైపు ప్రాణహిత- చేవేళ్ల లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును చేపడతామని ప్రకటించడంపై ఇరిగేషన్‌శాఖ అధికారులే నవ్వుకుంటున్నారు. వాస్తవంగా ప్రాణహిత-చేవేళ్ల ప్రాజెక్టుకు, కాళేశ్వరం ప్రాజెక్టుకు గోదావరిపై నిర్మించిన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లు మాత్రమే వ్యత్యాసం. అటు తరువాత ఎల్లంపల్లి నుంచి కాళేశ్వరం ప్రాజెక్టులో నిర్మించిన నీటి పంపిణీ వ్యవస్థ అంతా ఒక్కటే. ప్రాణహిత చేవేళ్ల ప్రాజెక్టులో భాగంగానే వాటిని ప్రతిపాదించారు. అందులో కొద్దిపాటి మార్పులు చేర్పులు చేసి, ప్రతిపాదిత రిజర్వాయర్ల సామర్థ్యాన్ని గత బీఆర్ఎస్ ప్రభుత్వం పెంచింది. ప్రస్తుత ప్రభుత్వం ప్రాణహిత చేవేళ్ల ప్రాజెక్టును నిర్మిస్తామని ప్రకటించినా తిరిగి యథావిధిగా అదే వ్యవస్థను మిడ్‌మానేర్, అన్నపూర్ణ, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ రిజర్వాయర్లను వినియోగించుకోవాల్సిందేనని ఇంజినీర్లు చెప్తున్నారు.

పెండింగ్ బిల్లులకే నిధులు

ప్రభుత్వం ఏఎమ్మార్పీ ఎస్ఎల్‌బీసీ, మహాత్మాగాంధీ కల్వకుర్తి, జవహర్ నెట్టెంపాడు, రాజీవ్‌భీమా, కోయిల్‌సాగర్ లిఫ్ట్ ఇరిగేషన్, ఎస్సారెస్పీ ఇందిరమ్మ వరద కాలువ, దేవాదుల, కుమ్రంభీం, చిన్నకాళేశ్వరం ప్రాజెక్టులకు ప్రాధాన్యమిస్తున్నట్టు ప్రకటించింది. ఇందులో రాజీవ్‌భీమా, వరదకాలువ, కుమ్రంభీం, దేవాదులలను ఇప్పటికే సత్వర సాగునీటి ప్రయోజిత కార్యక్రమం (ఏఐబీపీ) కింద చేర్చి ఆ పనులను నిర్వహిస్తున్నది. మిగతా ప్రాజెక్టులు ఇతరత్రా వాటికి ఈ బడ్జెట్‌లో మొత్తం రూ.28,024 కోట్లను ప్రతిపాదించింది. అయితే ఇరిగేషన్‌శాఖలో పెండింగ్ బిల్లులే దాదాపు రూ.14 వేల కోట్లకుపైగా ఉన్నాయి.

ఓపెన్ మార్కెట్ రుణాలు 59,625 కోట్లు

గతం కంటే రూ.19,010 కోట్లు ఎక్కువ
బడ్జెట్‌లో ప్రతిపాదించిన రాష్ట్ర ప్రభుత్వం

హైదరాబాద్, ఫిబ్రవరి 10 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ ప్రభుత్వం ఎడాపెడా అప్పులు చేసిందని, తాము అప్పులను కట్టడి చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చెబుతున్నది. కానీ.. చేతలు మాత్రం అందుకు భిన్నంగా ఉన్నాయి. చేతికి అందిన కాడికి అప్పులు చేసేస్తున్నది. కేవలం మూడు నెలల కాలంలోనే బాండ్ల విక్రయాల ద్వారా సుమారు రూ.6400 కోట్ల అప్పులు చేసింది. అంతకుముందు బీఆర్ఎస్ సర్కారు చేసిన అప్పులతో పోలిస్తే ఇది ఎంతో ఎక్కువ. బడ్జెట్ ప్రతిపాదనల్లోనూ బీఆర్ఎస్ కంటే ఎక్కువగా రుణాలు సేకరిస్తామని ప్రతిపాదించింది. 2022-23 ఆర్థిక సంవత్సరం ఓపెన్ మార్కెట్ ద్వారా రుణాలు రూ. 40,150 కోట్లు వస్తాయని అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం అంచనా వేసింది. ఆ తర్వాత ఆర్థిక సంవత్సరం అంటే 2023-24లో రూ.40,615 కోట్లు వస్తుందని అంచనా వేసింది. అంతకుముందు ఏడాదితో పోలిస్తే కేవలం రూ.500 కోట్లు మాత్రమే ఎక్కువగా వస్తాయని ప్రతిపాదించింది. కానీ..ఈ సారి కాంగ్రెస్ ప్రభుత్వం ఓపెన్ మార్కెట్ రుణాల రూపంలో రూ. 59,625 కోట్లు వస్తాయని తెలిపింది. అంటే.. బీఆర్ఎస్ ప్రభుత్వంతో పోలిస్తే రూ.19,010 కోట్లు ఎక్కువ వస్తాయని పేర్కొన్నది. ఒకేసారి అంత భారీగా రుణాలు ఎక్కడి నుంచి వస్తాయి? ఎలా సేకరిస్తారు? అన్న దానిపై మాత్రం స్పష్టతనివ్వలేదు.

అసెంబ్లీ రెండు రోజులు పొడిగింపు?

హైదరాబాద్, ఫిబ్రవరి 10 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ సమావేశాలు రెండురోజులపాటు పొడిగించే అవకాశాలున్నాయి. ఈ నెల 13తో ముగియాల్సిన సమావేశాలు ఆ రోజున మేడిగడ్డ పర్యటనకు వెళ్లాలని ప్రభుత్వం నిర్ణయించింది. 12న సభ వాయిదా వేసి తిరిగి 14, 15 తేదీల్లో కొనసాగించే అవకాశాలున్నాయని అంచనా వేస్తున్నారు. బడ్జెట్‌పై చర్చ, ఆమోదం సోమవారం జరిగే అవకాశాలున్నాయి. బీసీ జన గణన బిల్లు, ద్రవ్య వినిమయ బిల్లు, నీటిపారుదల ప్రాజెక్టులపై శ్వేతపత్రాన్ని అసెంబ్లీలో ప్రవేశపెట్టాల్సి ఉన్నది. ఎన్ని రోజులు సమావేశాలను కొనసాగించేది ఆదివారం జరిగే సీఎల్పీ సమావేశంలో స్పష్టత వస్తుందని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి.

బడ్జెట్‌లో విద్యకు 7.75 శాతమే

- మ్యానిఫెస్టోలో 15% కేటాయిస్తామన్న కాంగ్రెస్
- విద్యారంగానికి బడ్జెట్‌లో రూ.21 వేల కోట్లు

హైదరాబాద్, ఫిబ్రవరి 10 (నమస్తే తెలంగాణ): 'విద్య, వైద్యం మా ప్రాధాన్యం. విద్యారంగానికి బడ్జెట్‌లో నిధుల వాటా పెంచుతాం. మొత్తం బడ్జెట్‌లో 15 శాతం నిధులను విద్యారంగానికి కేటాయిస్తాం..' ఇది కాంగ్రెస్ పార్టీ ఎన్